క్లుప్తంగా

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం , శేషవస్త్రాలను అందించారు.

చీటీల పేరుతో మోసం చేసిన మహిళపై కేసు

పెదగంట్యాడ : చీటీల పేరుతో మోసం చేసిన కేసులో ఓ మహిళను న్యూపోర్టు పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని నెల్లిముక్కు పరిధి గొందేశి వీధిలో నివసిస్తున్న అంధవరపు లక్ష్మి, మల్కాపురం రెడ్డి వీధిలో నివసిస్తున్న నూనెల లక్ష్మి అనే మహిళ వద్ద రూ.5 లక్షలు, రూ.3 లక్షల చీటీలు కట్టింది. చీటీల గడువు ముగిసిన తర్వాత తమ సొమ్ము ఇవ్వాలని బాధితురాలు కోరడంతో సదరు నూనెల లక్ష్మి అధిక వడ్డీ ఆశ చూపింది. కొన్నాళ్లు గడిచిన తర్వాత గత జనవరిలో తమ కుటుంబ అవసరాల నిమిత్తం తన సొమ్ము తనకు జమ చేయాలని కోరడంతో నూనెల లక్ష్మి, ఆమె భర్త మోహన్‌రావు చేతులెత్తేయడంతో బాధితురాలు న్యూపోర్టు పోలీసులను ఆశ్రయించింది. దీనిపై కేసు నమోదు చేసిన న్యూపోర్టు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్యాత్మిక బోధన



తీరంలో బ్రహ్మకుమారీస్ ఆధ్యాత్మిక బోధన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ముత్యాలమ్మపాలెం తీరంలో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ వాడచీపురుపల్లి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక బోధ శిబిరాన్ని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శివుడు జ్యోతి స్వరూపుడని, శివనామ స్మరణం సర్వపాప హరణం అని పేర్కొన్నారు. పుణ్య స్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులకు శివుని బోధనలను బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు వివరించి, కరపత్రాలు, ప్రసాదం పంచిపెట్టారు. కార్యక్రమంలో పరవాడ ఎస్ఐ కృష్ణారావు, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు సోమేశ్వరమ్మ, అప్పారావు, ప్రభాకరమూర్తి, ఆదిలక్ష్మి, విజయలక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తం

వీధిదీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. చాలాచోట్ల వీధి దీపాలు వెలగక వీధులు అంధకారంలో ఉన్నాయి. పలుప్రాంతాల్లో పగటి పూట కూడా లైట్లు వెలగడంతో విద్యుత్ వృథా అవుతోంది. సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో పరిస్థితి గందరగోళంగా ఉంది.



దయానందనగర్‌లో పగలు వెలుగుతున్న వీధిలైట్లు



కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్‌పై లైట్లు లేని విద్యుత్ స్తంభం

ఒకవైపు పగలు వెలుగులు

మరోవైపు రాత్రి వేళ చీకట్లు

సిబ్బంది నిర్లక్ష్యం

అధికారుల పర్యవేక్షణ లోపం

24 గంటలూ వెలుగులే..

గౌరీనగర్, గోకుల్‌నగర్, దుర్గానగర్ రైల్వే ట్రాక్ రహదారి ప్రాంతాల్లో గత పదిహేను రోజులుగా విద్యుత్ లైట్లు 24 గంటలు వెలుగుతున్నాయి. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు, స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. చాలా వీధులు అంధకారంలో మగ్గిపోతుంటే, ఇక్కడ విద్యుత్ వృథా అవుతోందంటున్నారు.

కంచరపాలెం: జీవీఎంసీ 56, 57వ వార్డుల్లో వీధి దీపాలు సరిగ్గా వెలగక వీధుల్లో అంధకారం నెలకొంటోంది. కంచరపాలెం, ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్ సచివాలయాల పరిధిలో సుభాష్‌నగర్, తుమ్మడపాలెం, దయానందనగర్, రాజీవ్‌కాలనీ ప్రాంతాలు చీకటిలో మగ్గిపోతున్నాయి. కొన్ని చోట్ల స్తంభాలకు దీపాలు లేకపోగా.. మరికొన్ని చోట్ల లైట్లు పనిచేయక పోవడంతో ఆయా కాలనీల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెనపై విద్యుత్ స్తంభాలు, దీపాలు ఏర్పాటు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక నిర్వహణ అంతంతమాత్రంగా ఉండడంతో స్తంభాలకు లైట్లు లేని పరిస్థితి కనిపిస్తోంది. ఆయా ప్రాంతాల్లో పదిహేను రోజులుగా లైట్లు వెలగడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పలు స్తంభాలకు లైట్లు సక్రమంగా పనిచేయడం లేదు. చీకటి వీధులు దొంగలకు నెలవుగా మారుతుంది. గత నెలలో కురిసిన వర్షాలు, గాలులకు విద్యుత్ దీపాల వైర్లు తెగిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో చీకట్లు అలముకున్నాయి. రాత్రి సమయాల్లో అటుగా వెళ్లాలంటేనే పాదచారులు, స్థానికులు భయాందోళన చెందుతున్నారు.



సుభాష్‌నగర్‌లో వీధి దీపాలు లేక చీకట్లు

పగలు నిత్యం వెలుగులు విరజిమ్ముతున్నా.. రాత్రుళ్లు చీకట్లు కమ్ముకున్నా పట్టించుకునే నాథుడు కనిపించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళ వీధిదీపాలు వెలగకపోవడంతో పెట్రోల్ దొంగలు హల్‌చల్ చేస్తున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వీధుల్లో విద్యుత్ దీపాల సమస్యపై జీవీఎంసీ విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



చాకలిగెడ్డ రాజీవ్ కాలనీలో విద్యుత్ స్తంభానికి లైట్లు అమర్చి కనెక్షన్ ఇవ్వకుండా వదిలేసిన దృశ్యం

బిక్కుబిక్కుమంటూ..

రాత్రివేళల్లో వీధి దీపాలు లేక చీకట్లో బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సి వస్తోంది. కొన్ని చోట్ల స్తంభాలకు లైట్లే లేవు. ఒకవేళ లైట్లు ఉన్నా కనెక్షన్ ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారు. చీకట్లో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని భయంగా ఉంటోంది. పగటి పూట వెలుగుతున్న విద్యుత్‌లైట్లపై అధికారుల పర్యవేక్షణ లోపం కనిపిస్తుంది. గతంలో ఇలాంటి సమస్యలు సచివాలయానికి వెళ్లి ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించేవారు. -పి.కార్తికేయ, కంచరపాలెం

అధికారులు స్పందించాలి

విద్యుత్ లైట్ల నిర్వహణపై కాంట్రాక్ట్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పగలు నిత్యం వెలుగులు విరజిమ్ముతున్నా.. రాత్రుళ్లు చీకట్లు కమ్ముకున్నా పట్టించుకునే వారే కనిపించడంలేదు. దొంగతనాల జోరుగా జరుగుతున్నాయి. పెట్రోలు దొంగలు హల్ చల్ చేస్తున్నారు. అధికారులు స్పందించి, సమస్య పరిష్కరించాలి.

-ఎ.నితీష్‌కుమార్, సుభాష్‌నగర్, ఊర్వశికూడలి, కంచరపాలెం

‘సైన్స్‌పై ఫోకస్’ పోటీల్లో ఆకట్టుకున్న నమూనా



మోడల్‌ను ప్రదర్శిస్తున్న ఆర్పీ పేట పాఠశాల విద్యార్థులు, కో-ఆర్డినేటర్ పల్లవి

- ఆర్పీపేట పాఠశాల విద్యార్థుల ప్రతిభ

కంచరపాలెం: సైన్స్ డే ను పురస్కరించుకుని డబ్ల్యూసీఎఫ్ సంస్థ వుడా చిల్డ్రన్ ఎరీనాలో గురువారం నిర్వహించిన ‘సైన్స్ పై ఫోకస్’ కార్యక్రమంలో కంచరపాలెం రామ్మూర్తి పంతులపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన మోడల్ ప్రదర్శించినట్లు ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ ప్రదర్శనకు హైస్కూల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ చొప్ప పల్లవి నేతృత్వంలో తొమ్మిదో తరగతి విద్యార్థులు డి.జెస్సీ, సీహెచ్ గౌతమి, బి.జ్యోత్స్న చక్కని నమూనా రూపొందించారు. పురాతన కాలంలో.. ఆధునిక కాలంలో మార్పులను సూచిస్తూ విద్య, వాహనాలు, వ్యవసాయానికి సంబంధించిన మూడు అంశాలను క్రోడీకరించి రూపొందించిన ఈ మోడల్ ఎంపిక కావడంపై హెచ్ఎం శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

పెదగంట్యాడ : మహా శివరాత్రిని పురస్కరించుకుని పాత అయ్యన్నపాలెం, శాతవాహన యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. మొత్తం ఆరు జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. వారియర్స్ టీమ్ ప్రథమ స్థానంలో నిలవగా టైటాన్స్ జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. విజేతలకు గురువారం సాయంత్రం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గొందేశి నాగిరెడ్డి, ఆనంద్, అరుణ్, వెంకటరెడ్డి, శ్రీను, హరీష్, అజయ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ మందిరం వార్షిక వేడుకలు



ప్రత్యేక అలకరణలో శ్రీకృష్ణుడు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం పరిధి గొల్లకంచరపాలెం విఘ్నేశ్వర మహాలక్ష్మి సహిత శ్రీకృష్ణ మందిరం 10వ వార్షిక వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు పల్లా ఎర్నికుమార్ యాదవ్, కార్యదర్శి కొయ్య జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారికి ఉదయం జలాభిషేకం, 108 కలశాలతో పంచామృతాభిషేకాలు చేశారు. నూతన వస్త్రాలంకరణ అనంతరం గరికపూసలు, మారేడు దళాలతో అర్చించారు. అన్నాభిషేకం చేశారు. కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి రామారెడ్డి, కాయిత పైడి రత్నాకర్, సర్వసిద్ధి సాయిలత, శ్రీకృష్ణ యాదవ్ సంక్షేమ సంక్షేమ సభ్యులు కృష్ణ భగవానుని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం గొల్లకంచరపాలెం గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ చేతుల మీదుగా భారీ అన్న సమారాధన ప్రారంభించారు. సుమారు 3వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను తిరువీధి నిర్వహించారు. పాలక– కార్యవర్గ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు పనులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు సర్వసిద్ధి ఉమ, కొయ్య శ్రీను, నైదాన సురేష్, నమ్మి జ్యోతేష్, నమ్మి నాగ సురేష్, నమ్మి శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ తదితరులు

సనాతన ధర్మం అన్నిటికన్నా గొప్పది

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

గాజువాక : సనాతన ధర్మం అన్నిటికన్నా గొప్పదని, అందరూ పాటించాల్సిన బాధ్యత ఉందని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. స్థానిక శ్రీనగర్‌లో గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో దివ్యప్రాణ ప్రతిష్ఠ, 108 కుండీల గాయత్రి మహాయజ్ఞం గురువారం నేత్రపర్వంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన పెరగాలన్నారు. గీతా పారాయణ, గాయత్రి మంత్రం, భగవద్గీత పఠనం మనిషిని మార్చుతాయన్నారు. భూమినే స్వర్గంగా భావించే పరివార్ సేవలు గొప్పవని కొనియాడారు. చేసిన సేవల్లోనే ఆత్మసంతృప్తి ఉంటుందన్నారు. జీవితంలో కొంత సమయాన్ని సేవకు ఉపయోగించాలన్నారు. ప్రతి ఒక్కరిలో ఒక కళ ఉంటుందని, అది కేవలం భారతీయుల్లోనే ఉంటుందన్నారు. నవ భారత నిర్మాణంలో యువత ప్రధాన భూమిక పోషించాలన్నారు. స్వామి వివేకానంద ఆలోచనా విధానాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకం కావాలన్నారు. కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, డాక్టర్ చిన్నయ పెండ్యా, నిర్వాహకులు ధన్‌జీ భాయ్ పటేల్, అవతారం రాజు, జగదీష్ ఆశోపా, పర్వీన్‌భాయ్ పటేల్, రూపవేణి, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఉపాధ్యాయులు ఓటెత్తారు

- ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నిక
- పశ్చిమ నియోజవర్గంలో 90.59 శాతం పోలింగ్
- జిల్లా నగటు కంటే ఎక్కువ పోలింగ్



ఓటు విలువపై ప్రచారం చేస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు భూషణం



గోపాలపట్నం కేంద్రం శిబిరంలో యూటీఎఫ్ ప్రతినిధులు



గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ వద్ద ఓటు వేసిన మార్క్ చూపిస్తున్న ఉపాధ్యాయులు

విశాఖ విద్య: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. గోపాలపట్నం జెడ్పీ బాలుర హైస్కూల్, కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీ, మల్కాపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మూడు పోలింగ్ స్టేషన్లు పరిధిలో 956 ఓటర్లు ఉండగా, వీరిలో 866 మంది ఓటు వేశారు. దీంతో నియోజకవర్గంలో 90.59 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. జిల్లా సగటు 87.30 శాతం కాగా, అంతకుమించి పశ్చిమ నియోజకవర్గంలో పోలింగ్ నమోదైంది. ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కాగా, ఉపాధ్యాయులు ఓటేసేందుకు కేంద్రాల వద్ద క్యూ కట్టారు. దీంతో మధ్యాహ్నం 1 గంటకు 67.43 శాతం పోలింగ్ నమోదైంది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి పరిశీలించారు. గోపాలపట్నం తహసీల్దార్ సీహెచ్‌వీ రమేష్, ఎన్నికల సెల్ డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్ పోలింగ్ తీరును ఉన్నతాధికారులకు నివేదించారు.

ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉపాధ్యాయ సంఘాలు

ఎమ్మెల్సీ ఎన్నికలను ఉపాధ్యాయులు సంఘాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. గోపాలపట్నం, మల్కాపురం పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దూరంలో పీఆర్‌టీయూ, యూటీఎఫ్ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి, తమ అభ్యర్థికి ఓటు వేయాలని కోరుతూ పోలింగ్ వేయాలని కోరుతూ ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేశారు. గాదె శ్రీనివాసులు నాయుడు, కోరెడ్ల విజయ గౌరి మధ్యనే పోటీ నువ్వా–నేనా అన్నట్లుగా ఓటింగ్ సరళి ఉందనే ప్రచారంతో తమ అనుకూల ఓటర్లను చేజారకుండా అభ్యర్థులు జాగ్రత్తలు పడ్డారు. కంచరపాలెం వంటి చోట్ల ఏపీటీఎఫ్ నాయకులు తిష్ట వేసి, ఓటింగ్ సరళిని పరిశీలించారు.

గోపాలపట్నంలో టీడీపీ నేతల ప్రలోభాలు

గోపాలపట్నం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి ఇరువైపులా టీడీపీ నాయకులు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి, ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలు చేశారు. ఎన్ఏడీ వైపున దారిలో 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, గోపాలపట్నం వైపు దారిలో 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ తమ అనుచరగణంతో తిష్టవేసి, ఆ దారుల్లో వచ్చే ఉపాధ్యాయులను పిలిచి, తమ అభ్యర్థిగా ప్రకటించిన రఘు వర్మకు అనుకూలంగా ఓటు వేయాలంటూ సూచించారు. ఉపాధ్యాయ సంఘాల మధ్య సాగాల్సిన ఎన్నికల్లో, రాజకీయ పార్టీ నాయకులు శిబిరాలు ఏంటని పలువురు గుసగుసలాడుకున్నారు.

మల్కాపురంలో..

మల్కాపురం: మల్కాపురం జీవీఎంసీ ప్రైమరీ పాఠశాలలో ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 164 ఉపాధ్యాయులు ఓటు వేశారు. ఎలాంటి సంఘటనల చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశారు. సీఐ విద్యాసాగర్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

మొత్తం ఓటర్లు

పోలింగ్ స్టేషన్	పురుషులు	మహిళలు	మొత్తం
గోపాలపట్నం	173	196	369
కంచరపాలెం	166	255	421
మల్కాపురం	70	90	166
మొత్తం	409	547	956

పోలైన ఓట్లు

గోపాలపట్నం	157	184	341
కంచరపాలెం	147	224	371
మల్కాపురం	65	89	154
మొత్తం	369	497	866



ఓటేసి వస్తున్న ఉపాధ్యాయురాలు

భక్తజన సంద్రం

హోరెత్తిన అప్పికొండ, యారాడ తీరం

పుణ్యస్నానాలు ఆచరించిన వేలాది మంది భక్తులు

మార్మోగిన శివనామస్మరణ



పూజలందుకుంటున్న అప్పికొండ సోమేశ్వర స్వామి

పెదగంట్యాడ : అప్పికొండ, యారాడ తీరం హోరెత్తింది. శివనామస్మరణతో మార్మోగింది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకని బుధవారం రాత్రి జాగారం చేసిన భక్తులు గురువారం ఉదయం సముద్ర తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం అప్పికొండ సోమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేయించారు. అప్పికొండతోపాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతోపాటు నగరం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో సముద్ర తీరం నిండిపోయింది. భక్తజన సంద్రంగా మారిపోయింది. ఈ సందర్భంగా భక్తులు తీరంలోని ఇసుక తిన్నెలపై శివలింగాలను రూపుదిద్ది పూజలు చేశారు. అంతేకాకుండా ఏటా ఇక్కడ శివరాత్రి రోజున జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఆలయ ఈవో కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాత్రంతా భక్తులు శివనామస్మరణ చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. బీచ్ పెట్రోలింగ్‌తో భక్తులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు. సముద్రం లోపలికి వెళ్లకుండా అక్కడ స్తంభాలు ఏర్పాటు చేశారు. అలాగే 100 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.


పంచామృత అభిషేకం

జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని బాల చెరువులోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో రామలింగేశ్వరుని సమేత పరమేశ్వరికి బుధవారం అర్ధరాత్రి పంచామృతాలతో అర్చకుడు వాసుదేవశర్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు నేరుగా భక్తులతో అభిషేకం చేయించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. రాత్రంతా శివనామస్మరణ చేస్తూ జాగారం చేశారు.



అప్పికొండ తీరంలో సముద్ర స్నానం చేస్తున్న భక్తులు

అప్పికొండ భక్తులతో సందడి



సందడిగా మారిన కూర్మన్నపాలెం జంక్షన్



మజ్జిగ పంపిణీ చేస్తున్న డీపీటీవో అప్పలనాయుడు

కూర్మన్నపాలెం : అప్పికొండ తీర్థయాత్రకు వెళ్లే భక్తులతో కూర్మన్నపాలెం బస్టాండ్‌లో సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి సముద్ర స్నానాలకు వెళ్లే అనేక మంది గురువారం ఉదయమే అక్కడికి చేరుకోవడంతో కళకళలాడింది. బస్సులు ఎక్కి, దిగేవారితో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారిపోయింది. స్టీల్ సిటీ సిబ్బంది, యూనియన్ నాయకులు అక్కడికి చేరుకుని భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తులకు సహకరించారు. మజ్జిగ శిబిరం ఏర్పాటు చేసి జిల్లా ప్రజారవాణాధికారి బి.అప్పలనాయుడు ప్రారంభించారు. ఆయనే స్వయంగా భక్తులకు మజ్జిగ, మంచినీరు అందించారు. సిబ్బంది, యూనియన్ నాయకుల సహకారం వల్లే స్టీల్ సిటీ డిపోకి ఈ ఏడాది ఊహించని ఆదాయం లభించిందని అసిస్టెంట్ మేనేజర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. వివిధ ప్రాంతాలకు తమ డిపో నుంచి సుమారు 100 సర్వీసులు నడిపామని తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి జి.సాయిరాం, నాయకులు చంద్రరావు పాల్గొన్నారు.